# కుక్క బతుకు

హెచ్చార్కె

"సామ్రాట్టు" రాజారావుగారి కుక్క.

రాజారావు ఆ వూరికి దొర.

దొర సంగతి తరువాత. ఇప్పుడు కుక్కకథ చెప్పుకుందాం.

సామ్రాట్టుకు కొన్ని రోజులుగా ఒక కోరిక పీకుతోంది. అది చిన్నప్పట్నించీ దొరగారి బంగళాలోనే పెరిగింది. ఆ గడీ, దొరగారు షికారు పోయేతోట తప్ప మరొకటి చూసి ఎరగదు. ఒక్కసారి, ఒక్కటంటే ఒక్కసారి తన కిష్టంవచ్చినట్లు అలా, అలా, అలలా తిరిగి రావాలని దాని కోరిక.

ఒక సాయంకాలం దొరసాని సామ్రాట్టును గొలుసువిప్పి, కాసేపు ముద్దుచేసి, మళ్లీ కట్టేయడం మరిచిపోయి, యింట్లోకి వెళ్లింది. మిగిలిపోయిన బిస్కట్ల ముక్కలు కొరుకుతోంది సామ్రాట్టు. బిస్కట్ల తీపిని మరిపించేట్లు చల్లనిగాలి వచ్చి తగిలింది. శుభ్రమైన గోధుమరంగు రోమాలు అలల్లాగ కదిలాయి. అది ఎప్పుడూ అణిచేసుకుంటున్న కోరికే దాని చర్మాన్నంతా కావిలించుకున్నట్లయింది. ఏమైనా సరే బయటికివెళ్ళి రావాలనిపించింది దానికి.

దొరగారు షికారుకు వెళ్లేలోగా రాలేకపోతానా లెమ్మని బయలుదేరింది.

సామ్రాట్టు వూరు దాటింది.

దాని కంతా కొత్తగా వుంది. గొప్పగా వుంది.

ఏట్లోంచి వచ్చే చల్లని గాలి దాన్ని ఎక్కడికో తీసుకు పోతోంది.

ఏటి గట్టున బట్టలుతుకుతున్న చాకలాళ్లు "యిస్సో, యిస్సో" అని అరుస్తున్నారు. తననే కాబోలనుకుని అటువైపు పరిగెత్తింది కుక్క. ఒకాయన దగ్గరకు వెళ్ళి నిలబడి "ఏమిటన్నట్లు" చూసింది. కాని ఆ పెద్దమనిషి సామ్రాట్టును చూడనే లేదు. ఇంకో పిలుపువిని మళ్ళీ పరిగెత్తింది. ఊహు! తనను గురించి కాదు.

అలాగే ఏటి గట్టున నడుస్తూ అడివి చేరింది. చెట్లమీద ఆకులు "గల గల" మని ఏమిటేమిటో అంటున్నాయి. పిట్టలు గాలిలో గిరికీలు కొట్టి మళ్లీ కొమ్మలమీద కూచుంటున్నాయి. బుద్ధిపుడితే కుక్కకు అర్థం కానిదేదో పాడుకుంటున్నాయి. రకరకాల పూలు సామ్రాట్టు మీద పడి "ఎక్కడికి నేస్తం" అని పలకరించాయి. పూల భాష అర్థంకాక చిరాగ్గా విదిలించింది కుక్క.

ఇంకా ముందుకు వెళ్లింది. కుందేలు పిల్ల ఒకటి టకటక గెంతుకుంటూ వచ్చి, చెవులు రిక్కించింది. సామ్రాట్టు పళ్లికిలించింది. కుందేలు పిల్ల భయపడిపోయి పక్క పొదలోనికి తుర్రుమంది. 'పిల్లడు సిగ్గుపడ్డాడు' అనుకుంటూ ముందుకుసాగి పోయింది సామ్రాట్టు. తనకు రోజూ వచ్చిపడే పచ్చిమాంసం ముక్కలు ఎక్కడి నుంచి వస్తాయో దానికేం తెలుసు, పాపం.

మరోచోట, అది తనవైపు క్రూరంగా చూస్తున్న రెండు కళ్లను చూసి దడుసుకుంది. ఆ కళ్ల వెనుక శరీరం నల్లగావుంది, కాని రూపంలో తనలాగే వుంది. అది తోడేలని, తన్ని దెబ్బకు చంపేస్తుందనీ తెలియకపోయినా, దాని కళ్లలో క్రూరత్వాన్ని చూసో, లేక దాని కళ్లల్లో తన దొరగారి కళ్లు కనిపించాయో- భయమేసి పక్కకుదూకి పరిగెత్తింది.

పోగా.... పోగా.... పోగా....

ఒకచోట, యింతపొడుగ్గా, కొమ్మలు కొమ్మలుగా తిరిగిన కొమ్ములతో, తల నేలకు వేలాడేసి పడుకున్న దుప్పి ఒకటి కనిపించింది. అది దిగాలుగా వుంది. అది సరిగ్గా తనలాగే గోధుమ రంగులో మెరుస్తోంది. కాని దాని కొమ్ములు చూస్తే సామ్రాట్టుకు విచిత్రమయింది. దాని దిగులు చూసి కొద్దిగా జాలి కూడా వేసింది.

"మీరెవ్వరండి" తాను నేర్చుకున్న నాగరీకం భాషలో సగర్వంగా, పిసరంత సానుభూతి కూడా రంగరించి పలుకరించింది.

"నేను దుప్పిని, నువ్వెవ్వరు?" అడిగింది దుప్పి. మొరటుగా, సామ్రాట్టు కోరలు చూసి కొంచెం అనుమానంగా.

"నాపేరు సామ్రాట్టు"

"అట్లాంటి జంతువున్నట్టు నాకు తెలీదే"

"అస్సలు, నేను కుక్కను. కాని చాల విశ్వాసపాత్రుణ్ణట. అందుకని దొరగారు, దొరసాని వాళ్లంతా నన్ను సామ్రాట్టని పిలుస్తారు" గర్వంగా మొర పైకెగరేసి అంది.

అదే మళ్లీ అడిగింది "ఏమిటి? నువ్వు ఎందుకలా దిగాలుగా వున్నావు."

"ఆకలేస్తోంది. పొద్దట్నుంచీ వంట్లో బాగోలేదు. గడ్డీ, ఆకులూ తినాలని పించటంలేదు." మరింత దిగాలుగా ముఖంపెట్టి చెప్పింది దుప్పి.

"అయ్యోపాపం. ఊళ్లోకి వెళ్లలేదూ"

610

"ఊళ్లోకి ఎందుకు వెళ్లాలి?" దుప్పి విసుగ్గా అడిగింది, బోడి సలహా చెప్పొచ్చావన్నట్లు.

"నీకేం తెలీదే? ఊళ్లోకివెళ్తే, అక్కడ దొర లుంటారు. మంచి, మంచి మాంసం ముక్కలు పెడతారు. అవి నీ కిష్టం లేకపోతే తియతీయని బిస్కట్లు పెడతారు. సుస్తే చేస్తే డాక్టరు దగ్గరకు తీసుకుపోయి నయంచేయిస్తారు."

"అంత బాగుంటుందా వూళ్లో" దుప్పి వుత్సాహంగా అడిగింది.

"మరేమనుకున్నావు, పిచ్చివాడా!? ఆకలేసినప్పుడల్లా దొరగారి దగ్గరకో, దొరసాని దగ్గరకో వెళ్లి మూతిపైకెత్తి, తోకాడిస్తే సరి. అక్కడికీ కుదరకపోతే, వాళ్ళ కాళ్ల నాకితేసరి "అరెసాౖమాట్టా, ఆకలేస్తోందిరా నీకూ" అని మాంసం ముక్కలో, బిస్కట్లో పడేస్తారు.

అంతేకాదు, మంచి, మంచి వాసన సబ్బులతో స్నానం చేయిస్తారు. ఫ్యాను గాలికింద ఎంచక్కా నిద్రపోవచ్చు. ఇంక, సుస్తీ చేస్తే. ముడుచుకు పడుకున్నా మంతే చాలు, డాక్టరు దగ్గరికి తీసుకుపోతారు.

"నాకు తెలీదే యివన్నీ. నువ్వేం చెయ్యనక్కరలేదా? తిండి వూరికే వస్తుందా. నీ మీద తోడేల్లా అవీ పడిచంపేయవా? ఏం భయముండదా?" దుప్పికి సాౖమాట్టు ఎక్కడో స్వర్గం గురించి చెబుతున్నట్లయ్యి, ప్రశ్నమీదా ప్రశ్న అడిగింది.

"ఏంచేయ నక్కర్లేదు. సాయంకాలం దొరగారితో షికారుకు పోవాలి. రాత్రిళ్లు జాగర్తగా కాపలాకాయాలి."

దుప్పి మధ్యలో అడ్డుతగిలింది.

"కాపలా ఏమిటీ?"

"కాపలా అంటే.... దొరగారింట్లో ఎన్నెన్నో వస్తువులుంటాయి. బీరువాలో డబ్బులూ, నగలూ వుంటాయి. గరిసెల్లో తిండి గింజలుంటాయి. వాటిని ఎవరైనా దొంగతనంగా ఎత్తుకు పోవడానికి వస్తే మంనంలేచి మొరగాలి. వాళ్ల మీద పడి కరవాలి."

"ఎందుకట్లా దొంగతనం. వాళ్లకుండవా అవన్నీ?"

"ఉండవు. వాళ్లంతా అలగా జనమంట. దొరగారూ, దొరసానీ ఎప్పుడూ తిడుతూవుంటారు, సాయంకాలాలు వాళ్లు కూలి గింజల కోసం గంపలు పట్టు కొచ్చినపుడు. వాళ్లను నేను చూశాన్లే. మట్టి కొట్టుకున్న మొహాలూ, వాళ్లనూ."

"కూలీ ఏమిటీ? తిట్టడమెందుకూ?"

"వాళ్లంతా పొలంలో పనిచేస్తారంట. 'వెధవలు పొద్దు పొడిస్తెగాని పొలానికి రారు. పొద్దు గుంకిందో లేదో యిళ్లకు పోతామని ఏడుస్తారు' అని దొరగారు తిడు తుంటారు. అట్లా పని చేసినందుకే కూలి. కాని వాళ్లకు కూలి గింజలు చాలవు. దొంగతనం చేస్తారు. అందరు కాదనుకో, కాని దొరగారయితే అందరు దొంగలే నంటారు. వాళ్లంటే ఆయనకు భయం కూడా."

"మరలాంటప్పుడు వాళ్లు పనిచేస్తే వచ్చిన గింజలేగా. వాళ్లు ఎత్తుకుపోతే నీకేం"

"బాగుంది. వాళ్లు పనిచేస్తే. అవి మన దొరగారివి కావా?" ఎంత పిచ్చివాడి వన్నట్లు చూసింది కుక్క.

"పొలాల్లో పనిజేసే వాళ్లకు లేకుండా, దొరగారికే ఎట్లా వచ్చాయి అవన్నీ"

"అదంతేలే. నీకు తెలీదు. అవి దొరగారివే. దొరగారికి దేవుడిచ్చాడు."

దుప్పికి యీ వ్యవహారమేం నచ్చలా, కాని దానికి వళ్లంతా నెప్పిగా వుంది. ఆకలి కూడా వేస్తోందేమో, బిస్కట్లు గుర్తుకొచ్చి నోరూరుంది.

ఇంతలో సామ్రాట్టు మెడ మీద నల్లని పట్టీ దుప్పి కళ్లలో పడింది.

"అద్సరే గాని అన్నా! నీ మెడలో అదేమిటీ? నల్లగా మెరుస్తోందీ?" అడిగింది.

"అదా, పట్టీ – తోలుపట్టి. దొరగారు దీనికి గొలుసు కట్టి తన చేత్తోపట్టుకుని షికారుక్కు తీసుకుపోతారు. మిగతా సమయాల్లో నయితే అదే గొలుసుతో స్తంభాని కట్టేస్తారు."

"ఛీ, ఏంబతుకు? బానిసబతుకు, నీ సొంతానికి ఏంబతికినట్టు." యిష్టంగా ఎగరడానికి, తిరగడానికీ వీల్లేనిస్థితి గుర్తుకొచ్చి దుప్పికి అసహ్యమేసింది.

కుక్క చిన్నబుచ్చుకుంది. "సదీలే సంబడం. గడ్డితినేబుద్ధి బిస్కట్లరుచేం తెలుసు....జెరమొస్తే మందుకు గతి లేదుకానీ– కబుర్లకేం తక్కువలేదు." ఉక్రోషంతో యీసడించింది.

నిరుత్సాహంవల్ల కబుర్లుబోరుకొట్టాయి సామ్రాట్టుకు.

విసుగ్గా చుట్టూ చూసింది.

"అయ్యో చీకటిపడింది. దొరగారు యీరోజు చావ గొడతారు" గొణక్కుంది, వణుక్కుంటూ.

612

"ఎవఁడ్రావాడు కొట్టేది. పొడిచి పేగుల్దియ్యకా...." దుప్పి ఠగ్గున లేచింది. మీదకు ఎవరో రాబోతున్నట్లు కొమ్ములు ఎక్కుపెట్టింది.

కుక్కకు యివేవీ వినిపించలేదు. నోరు తెరచి, నాలుక వేలాడేసుకుని, తోక ముడిచి వూరివైపు పరుగులు తీసింది.

* * *

"కథ బాగోలా" సుబ్బారావు అడిగాడు.

"బాగుంది కానీ...." నానిగాడు వుత్సాహంగా ఏదో అడగబోయాడు. కథ పూర్తియినట్లనిపించలా వాడికి.

"సుబ్బారావుగారూ" బయటినుండి కేక.

ఆఫీసు బంట్రోతు.

"ఏమప్పా చెన్నయ్యా, ఏం సంగతి"

"దొరగారు రమ్మంటున్నారు"

"ఇప్పుడే గదయ్యా, ఆఫీసు నుండి వచ్చింది. ఈ సాయంత్రం పూట ఏమొచ్చిందని? పెళ్లాం పిల్లలతో కాసేపన్నా బతకనీయరా, ఏం?"

సుబ్బారావు విసుక్కుంటూ లేచి చొక్కా, లాగూ వేసుకున్నాడు.

"నాన్నా, మరే.... కుక్క తొందరగా వెళ్లనందుకు దొరగారు నిజంగా చావగొట్టారా?" నానిగాడు వున్నట్టుండి అడిగాడు.

"చావగొట్టడమేంటి. తన్ని తగిలేస్తాడు బయటకు" సుబ్బారావు చిరాగ్గా అంటూ త్వరత్వరగా వెళ్లిపోయాడు.

నానిగాడికి దుప్పి అంటే భలే యిష్టం ఏర్పడింది. ఎందుకో ?!??!!

---

## చిగురించిన జీవం

శంకర్

రక్తంతో తడిసిన తూటాలతో
తూట్లు పడక ముందే
తెప్పరిల్లిన వృక్షం
తనను పెనవేసికొని
చావనున్న మనిషిని అడిగింది:
మవ్వు చేసిన తప్పేమిటని.

సమాధానం: చిరునవ్వు.
ఆ నవ్వులో—
ఉదయించే కోటి సూర్యుల
అరుణిమ తళుక్కుమంటే
దాని భాష్యాన్ని
ప్రతి ఆకుపైనా రాసుకుంది.

613